నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శుక్రవారం | ఫిబ్రవరి 14, 2025 | www.navatelangana.com

అత్యవసర సమయంలో రక్తదానం

నవతెలంగాణ-నిర్మల్ టౌన్



ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్సింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న రాకేష్ అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఉదారత చాటుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేషెంట్‌కి రక్తం అత్యవసరం కాగా రక్తదానం చేసేందుకు దాతలు దొరకకపోవడంతో, అక్కడే డ్యూటీలో రాకేష్ మానవతాధృక్పథంతో రక్తదానం చేశాడు. దీంతో నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ, కమలమ్మ ఆయన్ని అభినందిస్తూ ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాకేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలో శ్యాంనాయక్ తండాకు చెందిన జాదవ్ భిక్కులాల్ విద్యుత్ సంస్థలో అనమ్యాండ్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబానికి గురువారం తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ సోసిటీ ఆధ్వరంలో తక్షణ సాయం కింద రూ.30 వేలు అందించారు. కార్యక్రమంలో సొసైటి మండల అధ్యక్షులు పాండు, కార్యదర్శి గంగన్న, ఉపాధ్యక్షులు ఇబ్రహీం, సతీష్. సుభాష్. ప్రకాష్. దిగంబర్, జబ్బార లాల్. సికెందర్ పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్..!

- మహారాష్ట్ర నుంచి కోళ్లు రాకుండా గట్టి నిఘా
- జిల్లా సరిహద్దుల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు
- భారీగా పడిపోయిన చికెన్ అమ్మకాలు
- ఆందోళన అవసరం లేదంటున్న అధికారులు

ఉమ్మడి జిల్లాను బర్డ్‌ఫ్లూ భయం పట్టుకుంది. ఈ వ్యాధి ఆనవాళ్లు జిల్లాలో కనిపించకుండా అధికార యంత్రాంగం గట్టి నిఘా పెడుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఈ వ్యాధి ప్రభావం లేకపోయినా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మహారాష్ట్ర ప్రాంతం సరిహద్దున ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. అక్కడ్నుంచి బాయిలర్ కోళ్లు రాకుండా అడ్డుకట్ట వేస్తోంది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల చెక్‌పోస్టుల వద్ద తనిఖీ కేంద్రాలు ఏర్పాటుచేసింది. బర్డ్‌ఫ్లూ మనుషులకు సోకకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. మరోపక్క బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందుతోందనే ప్రచారం కారణంగా చికెన్ తినేందుకు అనేక మంది అనాసక్తి చూపిస్తున్నారు. దీంతో చికెన్ సెంటర్లు వెలవెలబోతుండగా.. ధర కూడా పతనం కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.





నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ వ్యాధి కలకలం రేపుతోంది. ఈ వ్యాధి బారినపడి బాయిలర్ కోళ్ల మృత్యువాత పడుతున్న దృష్ట్యా ఈ వ్యాధి మనుషులకు సోకకుండా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో ఈ వ్యాధి ప్రభావం కనిపించకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి కోళ్ల రాకుండా అడ్డుకట్ట వేస్తోంది. ఇందుకు జిల్లా నలుమూలలా తనిఖీ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఆదిలాబాద్ జిల్లాలోని భోరజ్, లక్ష్మీపూర్ చెక్‌పోస్టులతో పాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి చెక్‌పోస్టు వద్ద కూడా తనిఖీలు చేపడుతున్నారు. ఈ తనిఖీ బృందంలో పోలీసులతో పాటు పశుసంవర్ధకశాఖ అధికారులు నిరంతరం నిఘా పెడుతున్నారు. కోళ్లతో వచ్చే వాహనాలు జిల్లాలోకి ప్రవేశించకుండా నివారిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.



ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఆరు ఫౌల్ట్రీఫాంలు ఉండగా సుమారు 37,500వరకు కోళ్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ కోళ్ల జిల్లాకు సరిపోవు కనుక కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాదుతో పాటు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి కోళ్ల వస్తుంటాయి. మన రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేని దృష్ట్యా ఇక్కడి కోళ్లను రవాణా నిమిత్తం అనుమతిస్తున్నారు. కానీ మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే కోళ్ల వాహనాలను మాత్రం జిల్లాలోకి రానీయడం లేదని అధికారులు చెబుతున్నారు.

చికెన్ అమ్మకాలపై ప్రభావం..!

బాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకుతోందనే కారణంగా వీటి అమ్మకాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ వ్యాధిపై విస్తృత ప్రచారం జరగడం..మనుషులకు సోకే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతుండటంతో కొన్ని రోజులుగా చికెన్ అమ్మకాలు భారీగా పడిపోయాయి. ఇది వరకు బాయిలర్ కోడి హోల్‌సెల్‌లో కిలోకు రూ.200 ధర ఉండగా..బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ కారణంగా రూ.170కి పడిపోయింది. రానున్న రోజుల్లో ఇంకా ధర పతనమయ్యే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో చికెన్ తినేందుకు అనేక మంది ఆసక్తి చూపించకపోవడంతో చికెన్ సెంటర్లలో గిరాకీ భారీగా పడిపోయింది.

నిరంతరం అప్రమత్తంగా ఉన్నాం

కిషన్, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి, ఆదిలాబాద్



బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రాణాంతకం కాదు. కానీ ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉన్నాం. ముఖ్యంగా ఆంధ్ర, మహారాష్ట్ర నుంచి కోళ్ల వాహనాలు జిల్లాలోకి ప్రవేశించకుండా చెక్‌పోస్టుల వద్ద తనిఖీ కేంద్రాలను ఏర్పాటుచేశాం. అధికారులు నిరంతరం నిఘా పెడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-వాంకిడి

పశువులను అక్రమంగా రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బుధవారం మండలంలోని టోల్ ప్లాజా, ఖమాన ఎక్స్ రోడ్డు వద్ద అక్రమంగా పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిలో ఇద్దరు ఎండీ. షాదుల్ ఖాన్, షేక్ అజీమ్ కాగజ్ నగర్‌కు చెందిన వారు పరారీలో ఉండగా వారిని పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. ఇద్దరికీ మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైన పశువులను అక్రమంగా రవాణా చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని, ఇలా తరుచుగా అక్రమంగా పశువులు రవాణా చేస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఎవరైన పశువులను రవాణ చేసే ముందు పశు వైద్యాధికారితో అనుమతి తీసుకొని యానిమల్ యాక్ట్ నిబంధనల ప్రకారం రవాణ చేయలన్నారు. పశువుల రవాణా చేసే సమయంలో ఏ రైతు వద్ద ఎక్కడ కొనుగోలు చేశారో అక్కడ సంబంధిత గ్రామ పంచాయతీ అనుమతి రశీదులు తప్పనిసరిగా చూపించాలన్నారు. పశువులను అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పదేండ్ల బీఆర్ఎస్ అవినీతి పాలనను ఎండగట్టాలన్నారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. గురువారం భైంసాలోని ఓ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన పార్టీ పట్టణ, మండల, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్‌లు, కార్యకర్తలతో సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వాగ్దానాలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయరంగ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. మోడీ హయాంలో దేశం సుభిక్షంగా ఉందని, ఢిల్లీ ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని, భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య విజయం సాధించేలా పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి హరి నాయక్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి శివ చంద్రగిరి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేష్, మండల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలున్నారు.

హీరాసుక్క ఉత్సవాలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఇచ్చోడ



హీరాసుక్క ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆదివాసీ పర్దాన్ పురోహిత్ ఉత్సవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక సుదర్శన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బోథ్ డివిజన్ పర్దాన్ పురోహిత్ ఉత్సవ సంఘం ఆధ్వర్యంలో సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న మండల కేంద్రంలోని ఆదివాసీ నగర్ కాలనీలో హీరాసుక్క ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. డివిజన్ పర్దాన్ పురోహిత్ సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గెడం మధుకర్, ఉత్సవ కమిటీ సంఘం సహాయక అధ్యక్షులు కుస్రం సీతారాం, కోశాధికారి మడావి మారుతి, సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డ్ ప్రతి ఒక్కరికి ఉండేలా చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ చైతన్య కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలలో చదివి విద్యార్థులు వివిధ సంక్షేమ పథకాల లబ్ది పొందేందుకు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. 5 సంవత్సరాలలోపు పిల్లలు సుమారుగా 36,679 మంది ఉన్నారని, వీరందరికీ ఆధార్ నమోదుకు జిల్లా సంక్షేమ శాఖ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో కృషి చేయాలన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలు ఆధార్ నమోదు సేవలు ఉచితంగా పొందవచ్చని, 15 సంవత్సరాలు దాటిన వారు మానిటరింగ్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. గతంలో ఆధార్ కోసం ఈఐడీఎస్ తిరస్కరణ జరిగిన వారి వివరాలు సేకరించి యూఐడీఏఐ కార్యాలయం హైదరాబాద్ పంపించాలని, ఆసరా పింఛన్ దారులు, ఉపాధి హామీ కూలీలు, వేలిముద్రలు పడని వారు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఆధార్ నమోదు, అప్‌డేట్‌కు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో మెగా క్యాంపులు నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలని తెలిపారు. తపాలా శాఖ అధికారులు ఆధార్ కార్డులు ఇంటింటికి త్వరగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ లోకేశ్వరరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, ముఖ్య ప్రణాళిక అధికారి కోటయ్య, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, విద్యాశాఖ అధికారులు, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజు పాల్గొన్నారు.

శత శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శతశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి అధికారులతో పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే వసూలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేయాలని తెలిపారు. ఈ క్రమంలో పన్ను వసూలుకు సంబంధించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి.. ఉపాధ్యాయుల గొంతునవుతా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగ సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన నన్ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకనవుతానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేపథ్యంతో పాటు ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై స్పష్టమైన అవగాహన అనుభవం కలిగిన నాయకుడు అశోక్ కుమార్ ఎమ్మెల్సీగా గెలిపించుకోవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై, అధ్యాపకులపై ఉందని టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

సంక్షేమం కోసం ప్రభుత్వంతో పోరాడుతా

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయించి ఓపిఎస్ పునరుద్ధరణ చేయిస్తామని, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం ఇప్పిస్తానని, కనీస వేతన అమలు చేయిస్తామని, పెండింగ్‌లో ఉన్న నాలుగు వేల కోట్ల బకాయిలు, పదవి విరమణ పొందిన వారికి పెన్షనరీ బెన్ఫిట్స్, మంచి ఫిట్మెంట్‌తో పిఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గురుకుల పాఠశాల టైం టేబుల్ మార్పిడి చేయిస్తామని, ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమల చేసి జీఓ నెంబర్ 57 ప్రకారం నెలవారీ ప్రమోషన్, అర్హత ఉన్న టీచర్లకు లెక్చరర్లకు ప్రమోషన్ ఇప్పిస్తామని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 కింద వేతనాలు ఇప్పించడానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో నిరంతరం పోరాడుతానని తెలిపారు. తనకు వ్యక్తి గతంగా ఎలాంటి వ్యాపారాలు లేవని ఉపాధ్యాయుల, అధ్యాపకుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

నిజాయితీ నిబద్ధతకు మారుపేరు అశోక్



ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకట్ మాట్లాడుతూ ఉద్యమాలతో సంబంధం లేని వారు డబ్బు సంచులతో వక్రమార్గాలతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి చూస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రయివేటు విద్యాసంస్థలు యజమానులు ప్రయత్నం చేస్తున్నారని, వీరి పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తతతో ఉండాలని అన్నారు. విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ నిజాయితీ నిబద్ధతకు మారు పేరుగా నిలిచిన అశోక్ కుమార్‌ను యూనియన్లు, జండాలు, ఎజెండాలకు అతీతంగా ఆత్మ ప్రభోధానుసారం ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో టీఎస్యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.కిష్టన్న, వి.అశోక్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు సీ.లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఏ.సురేఖ జిల్లా కోశాధికారి కే.శ్రీనివాస్ జిల్లా కార్యదర్శులు ఏ. స్వామి, సీ.విలాస్, కే.గణేష్, ఆర్. మీరా, సోషల్ మీడియా కన్వీనర్ కే.శంకర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితాపై సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ శేక్ సఫ్దార్ అలీ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. రెండవ సాధారణ స్థానిక సంస్థ ఎన్నికలు-2025 ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా అభ్యంతరాలపై ఆయా పార్టీల నాయకులతో చర్చించి అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోలేటి స్వామి, మైదం రమేష్, బీఆర్ఎస్ నాయకులు వాసుదేవ్, బీజేపీ నాయకులు బాలరాజు, టీడీపీ నాయకులు భీమయ్య సీనియర్ సహాయకులు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండల కేంద్రంలోని మిలింద్ నగర్‌లో ఆశ్రమ పాఠశాల పక్కన అక్రమ బెల్టు షాపు నిర్వహిస్తున్న జైస్వాల్ పవన్ కుమార్ ఇంట్లో రూ.5,628 మద్యాన్ని ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. తనిఖీలో భాగంగా బెల్టు షాపులో దాడిచేసి అక్రమంగా విక్రయించేందుకు సిద్దంగా మద్యాన్ని స్వాధినం చేసుకున్నామని తెలిపారు. జైస్వాల్ పవన్ కుమార్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

సరోజినీ నాయుడు జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆంగ్ల భాష దినోత్సవం సందర్భంగా సరోజినీ నాయుడు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సరోజినీ నాయుడు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆంగ్ల ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సువర్ణ, గణేష్, సుజాత, నవీన్, దశరథ్, కిషోర్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నూతన కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని గురువారం ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్, మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కూర్చోవడానికి సమావేశం ఏర్పాటు చేయడానికి ఈ కార్యాలయంలో ఉపయోగించుకోవాలని అన్నారు. స్థానిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లకు పోటీ చేసి భారీ మెజారిటీతో మనమే గెలుస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీకి భయపడి ఎన్నికలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సొసైటీ డైరెక్టర్ మహేందర్‌రెడ్డికి సంతాపం



నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల తలమడుగు పీఏసీఎస్ డైరెక్టర్ గోక మహేందర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. కాగా గురువారం పీఏసీఎస్ భవనంలో చైర్మెన్, సిబ్బంది మహేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘంలో ఒక మంచి డైరెక్టర్‌ని కోల్పోవడం ఎంతో బాధాకరమని, ఆయన సొసైటీ అభివృద్ధికి చేసిన సేవలు మర్చిపోలేమని అన్నారు. కార్యక్రమంలో సీఈఓ మోతే శ్రీనివాస్, పీఏసీఎస్ సిబ్బంది, రమాకాంత్, భారత్, అశోక్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓ పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గజ్జల పోతన్న అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి స్మైల్ సొసైటీ గురువారం ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పేద కుటుంబానికి తమ వంతుగా సహాయం చేస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో భూరె సురేష్, సాయిగౌడ్, రామకృష్ణ, సంతోష్ రెడ్డి, సీతారాం, కిరణ్, నజీర్, అఫ్సర్, నవీన్, భూమన్న పాల్గొన్నారు.

పరీక్షల సన్నద్ధతపై ఎమ్మెల్యే ఆరా..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థుల సన్నద్ధతను ఎమ్మెల్యే పాయల శంకర్ పరిశీలించారు. గురువారం పట్టణంలోని బీసీ వసతి గృహాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పదో తరగతి ప్రిపరేషన్‌లో సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. వసతి గృహంలో భోజనం ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని అన్నారు.

సేవాలాల్ జయంతి ఏర్పాట్లు ప్రారంభం



నవతెలంగాణ-ఇచ్చోడ

ఈనెల 15న సేవాలాల్ జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సేవాలాల్ మహరాజ్ జెండా గద్దె వద్ద ఈఓ సూర్యప్రకాష్, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌తో చదును చేయించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిర్వహించే సేవలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమం సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తహా

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని కంపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన అఖండ హరినామ సప్తహ కార్యక్రమం గురువారంతో ముగిసింది. గ్రామస్తులు గత ఏడు రోజులుగా భక్తి శ్రద్ధలతో భజన కీర్తనలు చేసి అన్నదానం నిర్వహించారు. అనంతరం కేంద్రే బాలాజీ మహారాజ్ ప్రవచనాలు చేసి సప్తహ సమాప్తం, కాల నిర్వహించారు. కార్యక్రమంలో దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్, తుకారాం మహారాజ్ గ్రామపటేల్ కేశవ్, గ్రామ పెద్దలు తానాజీ, గోవింద్ మారుతీ, బాబు, జ్ఞానోబా, సంజు, దత్త మాణిక్ రావ్, కిషన్ పటేల్ వివిధ గ్రామాల మహారాజ్, పటేల్‌లు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన కోదండ రామాలయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని రామాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి 10వ తేది వరకు విశిష్ట పూజా కార్యక్రమాల నడుమ ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవాన్ని జరపనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ప్రారంభోత్సవానికి సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. వేద పండితులు బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ ఆచార్యత్వంలో జరపనున్న మందిర ప్రారంభోత్సవాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామాయి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్లలో అవినీతి

- కలెక్టర్ దృష్టి సారించి సమగ్ర విచారణ జరపాలి
- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ పత్తి కొనుగోళ్లలో గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి జరగడం దారుణమని, ఈ విషయంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరపాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ ఏడాది ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దాదాపు రూ.25లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసిందన్నారు. కొనుగోళ్లలో భారీగా అవినీతి జరగడం, మార్కెట్ సెక్రటరీని సస్పెండ్ చేసే పరిస్థితికి కారణమెంటని ప్రశ్నించారు. గత పదేండ్లలో ఇంతకంటే భారీ ఎత్తున కొనుగోళ్లు జరిగినా, ఎటువంటి అవినీతి ఆరోపణలు రాలేదని గుర్తు చేశారు. పక్క జిల్లాలు, రాష్ట్రాల నుంచి పత్తిని తీసుకువచ్చి కౌలు రైతుల పేరిట విక్రయించారని, ఇందులో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సీసీఐలో జరిగిన అవినీతిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, గోవర్దన్, దమ్మాపాల్, కొండ గణేష్, బట్టు సతీష్, అప్కామ్ గంగయ్య, దాసరి రమేష్, బుట్టి శివకుమార్, దేవిదాస్, తిరుపతి, నవతే శ్రీనివాస్, ఉగ్గే విఠల్, కలిమ్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఎలాంటి అంగవైకల్యం రాదని జిల్లా కుష్టు నివారణ అధికారి గజానన్ అన్నారు. గురువారం తాటిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పర్ష్ లెప్రసీ అవర్నెస్ పక్షత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కుష్టు లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్సలు తదితర వాటి గురించి తెలియజేశారు. అనంతరం కుష్టు నివారణకు పాటుపడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గజానన్ మాట్లాడుతూ మైకో బ్యాక్టీరియం లేప్రె అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వస్తుందన్నారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దు బారిన మచ్చలు, కాళ్ల చేతుల్లో తిమ్మర్లు రావడం కుష్టు వ్యాధికి లక్షణాలన్నారు. ప్రాథమిక దశలో దీన్ని గుర్తించి చికిత్సలు తీసుకుంటే అంగవైకల్యం రాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటి పారామెడికల్ అధికారులు వామన్ రావ్, రమేష్, ఎంఎల్‌హెచ్‌పీ అశ్విని, సీఓ రణిత, పాఠశాల హెచ్ఎం తిరుపతిరెడ్డి, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్త అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇచ్చోడ : ప్రజలు కుష్టు వ్యాధిపై అపోహలు వీడాలని, జిల్లా కుష్టు నివారణ విభాగం వైద్యులు డాక్టర్ సాగర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకుల పాఠశాల కళాశాలలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాగర్ మాట్లాడుతూ శరీరంపై పాలిపోయిన, రాగి రంగు గల మొద్దుబారిన మచ్చలు, కాళ్ళు, చేతుల్లో తిమ్మిర్లు రావడం కుష్టు వ్యాధి లక్షణాలు అని పేర్కొన్నారు. కుష్టు వ్యాధికి ఆధునిక చికిత్స అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లభిస్తుందని తెలిపారు. ప్రారంభం దశలో గుర్తించి, చికిత్స తీసుకుంటే ఎలాంటి అంగవైకల్యం కలగదన్నారు. చికిత్సలో ఉన్న కుష్టు రోగులతో ఇతరులకు సోకదన్నారు. కుష్టు రోగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నట్టు అనుమానం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో డాక్టర్ సంప్రదించి, సంబంధించిన కోర్సు వాడితే కేవలం 6 నుంచి 12 నెలల్లోనే నయం అవుతుందన్నారు. ఆనాడు మహాత్మా గాంధీ కుష్టు వ్యాధి నిర్మూలనకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల పనులను పరిశీలించిన జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భక్తి మార్గాన్ని పెంచాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అనేక ఆలయాలు నిర్మించారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ఆలయాలను పరిశీలించారు. ముందుగా పట్టణంలోని శంకర్ గుట్టలో నిర్మాణంలో ఉన్న బీరప్ప ఆలయంతో పాటు మహంకాళి ఆలయ పనులను పరిశీలించారు. బీఆర్ఎస్ హయంలో నిధులు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. ముందుగా ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ అయోధ్యలో ఒక రామాలయం నిర్మించి, బీజేపీ వారు ఎన్నికల సమయంలో రాములోరి అక్షింతలను ఇండ్లకు పంపిణీ చేశారన్నారు. కానీ తాము రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో వందల కోట్లతో ఆలయాలను నిర్మించిన ఎన్నడు కూడా అక్షింతలు ఇవ్వలేదన్నారు. దేవుడి పేరు చెప్పుకొని ఓట్లు అడిగారన్నారు. ప్రజలను దేవుని పేరుతో బీజేపీ మోసం చేస్తుందన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన పాయల శంకర్ ఏ ఒక్క ఆలయమైన నిర్మించారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయంలో మంజూరైన ఆలయాల పనులను పరిశీలించేందుకు ఆలయాలను సందర్శిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అజయ్, మెట్టు ప్రహ్లాద్, పరమేశ్వర్, గోవర్ధన్, ధమ్మపాల్ ఉన్నారు.

హీరాసుక ఆలోచన విధానాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గోండిధర్మ గురువు హీరాసుక ఆలోచన విధానాలతో పాటు ఆధ్యాత్మిక ప్రావీణ్యాన్ని భవిష్యత్తు తరాలకు అందించేలా గ్రామగ్రామన కార్యక్రమాలు నిర్వహించాలని, ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం హీరసుక జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే హీరసుక జయంతి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. శాంతినగర్‌లోని ఆయన నివాసంలో కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి కరపత్రాలను విడుదల చేయించారు. అనంతరం జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని, ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు ఆచరాలు, ధర్మాన్ని భవితరాలకు అందించేలా ఉండాలని కోరారు. పట్టణంలో హీరసుక విగ్రహం ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల అనంతరం అనువైన స్థలం గుర్తించి అక్కడ హీరసుక విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా మున్సిపల్‌లో తీర్మానం చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెస్రం శంకర్, సభ్యులు పూసం ఆనంద్‌రావు, సెడ్మాకి సుభాష్, కుడ్మెత ప్రకాష్, దిగంబర్ మడవి, మెస్రం హరీశ్, ఆత్రం భూమన్న, అర్క శేషరావు, గేడం మాదవ్, కుర్సెంగ యాదవ్ రావ్, సీడం రవి పాల్గొన్నారు.



సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని మండల ప్రత్యేకాధిరి పద్మభూషణ్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి బహిరంగ విచారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రజావాణిలో 75 మంది దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో తెలియజేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోవింద్, ఏఓ, ఏఈ ఎలక్ట్రిసిటీ, డీటీ సివిల్ సప్లై, ఏటీడీఓ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ 420 హామీలను నెరవేర్చాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రకటించిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని 420 హామీలను నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాస్ అన్నారు. గురువారం చలో హైదరాబాద్ పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యాలయం కుమురంభీం భవనంలో ఆవిష్కరించారు. ఈనెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు పూర్తయినా ఇప్పటివరకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇండ్లు లేని పేదలందరికీ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. రేషన్ కార్డు లేని పేద ప్రజలందరికీ వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రైతు రుణమాఫీ రెండు లక్షల వరకు చేస్తామన్నారు. మాఫీ చేయడంలో విఫలమయ్యారన్నారు. రైతు భరోసా పథకాన్ని రూ.15వేల నుంచి రూ.12 వేలకు కుదించి అవి కూడా ఇవ్వడంలో విఫలమవుతున్నారన్నారు. కల్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం తుంగలో తొక్కారన్నారు. పెన్షన్లు పెంచడంలో కనీసం ఆలోచనలో కూడా లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట నారాయణ, జిల్లా నాయకులు సుభాష్, నర్సింగ్, దేవిదాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హరీశ్, మడావి గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి దత్తు, పీవైఎల్ రాష్ట్ర నాయకులు మెస్రం మారుతి, జిల్లా నాయకులు సుంగు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడికి మైసమ్మ కాలనీవాసుల సన్మానం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు సొసైటి డైరెక్టర్ చట్ల ఉమేష్‌ను మండల కేంద్రంలో స్థానిక మైసమ్మ కాలనీ వాసులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడారు. కాలనీలో నెలకొన్న రోడ్డు సమస్యను బోథ్ డెవలప్‌మెంట్ గ్రూప్‌లో పెట్టిన వెంటనే స్పందించి, సొంత నిధులతో రోడ్డు సమస్యను పరిష్కరించిందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో కలిసి కాలనీ వాసులు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు సురేష్ వైద్య మాట్లాడారు. యువత సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలని గ్రామాభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు సీహెచ్. రాఘవులు, బూస రాములు, భోజన్న, పాలిక్ రమేష్, అంజనా రాము, తూము భాస్కర్, శేఖర్, అల్లాడి శేఖర్, నయీమ్, రాములు, శంకర్, ప్రకాష్, బారె సాయి కిరణ్, కంఠం ఆకాష్, బొడ్డు మల్లేష్, మణికంఠ, కాలనీ యువకులు పాల్గొన్నారు.

బేటి బచావో బేటి పడావో పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్

బేటి బచావో బేటి పడావో పథకంపై గురువారం ఖానాపూర్ పట్టణంలోని ఎంజేపీ బాలికల పాఠశాలలో మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, మౌనికలు అవగాహన కల్పించారు. బేటి బచావో బేటి పడావో పథకం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 45 రోజులు కార్యక్రమంలో భాగంగా స్కూల్‌లో వారు మాట్లాడుతూ విద్యార్థులకు భేటీ బచావో బేటి పడావో పథకం గురించి, లింగ సమానత్వం, ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, బాలికల సాధికారత, చైల్డ్‌లైన్ సర్వీసెస్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, బాల్య వివాహ నిర్మూలన చట్టం 2006, సైబర్ క్రైమ్, హెల్ప్ లైన్ నెంబర్లు 100, 1098, 181, 1930, రుతుక్రమ, ఆరోగ్య పరిశుభ్రత, పౌష్టికాహారం పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, చైల్డ్‌లైన్ సుప్రియ, శ్రీదేవి, ఆశ వర్కర్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో గురువారం ఓల్డ్ కోర్టు బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన సానిటరీ నాప్‌కిన్స్ కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో పీఎం జన్ మన్‌పై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రైతు బీమా పత్రాల సేకరణ

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన జంగాల హనుమల్లు రైతు మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. దీంతో గురువారం వ్యవసాయ విస్తీరణ అధికారి ఈర్ల చరణ్, మృతి చెందిన రైతు బీమా పత్రాలను సేకరించారు. మృతుడి భార్య గోదావరి నామిని బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డులను, తీసుకొని ప్రభుత్వం అందించే రూ.5లక్షల రైతు బీమా పథకం రైతుకు అందేలా చూస్తామని అన్నారు. ఆయన వెంట గ్రామస్తులు తూము రాజేశ్వర్, కిని శంకర్, సాయినాథ్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలంలోని వంజీరీ రైతు వేదికలో నీరు, భూమి యాజమాన్య శిక్షణ, పరిశోధన సంస్థ వాలంటరీ హిమాయత్ సాగర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు భూమి మరియు నీటి సంరక్షణ యాజమాన్యం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, వాలంటరీ సహాయ వ్యవసాయ అధికారి కే.సునీత వ్యవసాయ అధికారి ఎస్.అన్నపూర్ణ, సిర్పూర్ కాగజ్‌నగర్ సహాయ వ్యవసాయ సంచాలకులు మనోహర్, వ్యవసాయ అధికారి రామకృష్ణ హాజరయ్యారు. నేల, నీటి వినియోగం భూ సంరక్షణ పద్ధతులు సేంద్రియ వ్యవసాయం, ఆయిల్ ఫామ్, తోటల సంరక్షణ ప్రాంతాల్లో నేల, నీటి సంరక్షణ పద్ధతులు డ్రిప్ ఇరిగేషన్ వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులు వివరించారు. నీటి కుంటాలు మల్చింగ్ విధానం కలిగే ప్రయోజనాలు ఇంకుడు గుంతలుపై శిక్షణ అందించారు.

సీఎండీని సన్మానించిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని సీహెచ్‌పీ, ఖైర్‌గూడ ఓపెన్ కాస్ట్ సందర్శనకు వచ్చిన సింగరేణి సీఅండ్ఎండీ ఎన్. బలరాం నాయక్, నూతన డైరెక్టర్ ఎల్వీ సూర్యనారాయణ, ఎన్. వెంకటేశ్వర్లును సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ బొగ్గు ఉత్పత్తిలో ప్రముఖ భూమిక పోషిస్తున్న ఈపీ ఆపరేటర్లకు వేకెన్సీతో సంబంధం లేకుండా టైం బాండ్ ప్రకారం సీ,బీ,ఏ గ్రేడ్‌లను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషశైనా రావు, జూపాక రాజేష్, జై కిరణ్ బాబు, మీస చంద్రశేఖర్, షిఫ్ట్ ఇన్‌చార్జి అంజయ్య తుంగల వెంకటేష్ పాల్గొన్నారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీఈఓ గమినియల్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పదవ తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ గమినియల్ అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నజ్రుల్ నగర్ నెంబర్ 3, నెంబర్ 5 పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో శత శాతంలో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్టుల నివేదికలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థులను వివిధ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం జడ్పీఎస్ఎస్ పెట్రోల్ వంపు పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల విద్యావనుల కేంద్రంలో నిర్వహిస్తున్న భవిత పాఠశాలను సందర్శించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి వచ్చిన డీఈఓని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎమ్మార్సీ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికల కోసం కృషి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల మండలంలో పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితులపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి తీసుకున్న ప్రతి నిర్ణయంలో రాజకీయ నాయకుల పాత్ర ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గత 2018 ఎన్నికలలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ రాజంపేట వలన ప్రస్తుతం 11 ఎంపీటీసీలు స్థానాలు నిర్ణయించడం జరిగిందన్నారు. మండల పరిధిలోని 2018 ఎన్నికల్లో 51 పోలింగ్ కేంద్రాలుండగా ఓటర్ల సంఖ్య పెరిగినందున 58 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 2011 జనాభా లెక్క ప్రకారం మండల జనాభా స్త్రీలు 18757మంది, పురుషులు 18489 మొత్తం 37246 మంది ఉన్నారని తెలిపారు. దీనిలో ప్రస్తుతం మండల పరిధిలో గల ఓటర్ల సంఖ్య స్త్రీలు 15111 మంది కాగా, పురుషులు 15351 ఉన్నారని, మండలంలో మొత్తం 30462 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మాలీలు ఐక్యంగా ఉండాలి

నవతెలంగాణ-బెజ్జూర్

మాలీలంత ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండ్గూరే శ్యాంరావు అన్నారు. గురువారం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలీలంతా ఐక్యంగా పోరాటాలు చేయాలని తెలిపారు. మాలీల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాలీలా సంక్షేమం కోసం తమ సంఘం కృషి చేస్తుందన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలు సాధనకు అందరు కృషి చేయాలని కోరారు. మాలీలు ఆర్థిక రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అన్ని రంగాల్లో ముందుకెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ హోదా కోసం మాలీలకు తీర్మానం చేసిందన్నారు. తెలంగాణలో బీజేపీ 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఎస్టీ హోదా కోసం పోరాటం చేయడం లేదన్నారు. ఎస్టీ హోదా కల్పించే వరకు తమ పోరాటం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు హర్షద్ హుస్సేన్, మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే.రామకృష్ణ, నాయకులు మోహన్, ఆది అశోక్, నందయ్య, ఆదే వసంతరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఎస్పీని సన్మానించిన కమిటీ సభ్యులు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరను విజయవంతంగా నిర్వహించిన ఏఎస్పీ చిత్తరంజన్‌ని ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు సత్కరించారు. గురువారం ఆలయ ప్రాంగణంలో శాలువాతో సన్మానించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించినందుకు ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ బుద్ధ స్వామి, ఎస్సైలు చంద్రశేఖర్, శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పెద్దవాగు ఆటోనగర్ అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ 14వ వార్షికోత్సవం నేడు నిర్వహించడం జరుగుతుందని వార్షికోత్సవ కమిటీ, ఆంజనేయ ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు హనుమాన్ ఆలయ అర్చకుడు ఒజ్జల శిరీష్ శర్మతో ప్రత్యేక పూజలతో ప్రారంభమై ఉదయం 10:30కు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

పంచాయతీ ఎన్నికల్లో అధికారుల పాత్ర కీలకం

● కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



స్థానిక సంస్థలు ఎన్నికలు రానున్న సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, విధుల నిర్వహణలో స్టేజ్-1, 2 అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్‌తో కలిసి కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్‌లోని స్టేజ్-1, 2 అధికారులు, సిబ్బందికి వేరువేరుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అధికారులు సమన్వయంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, ఈ క్రమంలో అందిస్తున్న శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి గడువు ముగిసేంత వరకు అధికారులు, సిబ్బందికి కేటాయించిన విధులను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వచ్చే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం స్టేజ్ -1, 2 అధికారులను నియమించడం జరిగిందని, స్టేజ్-1 అధికారులు తమకు కేటాయించిన గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ఉంటాయన్నారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి పై సమీక్షించడం, ఎలాంటి వివాదాలు లేకుండా నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయడం వంటి విధులు నిర్వహిస్తారని తెలిపారు. స్టేజ్-2 అధికారులు గ్రామపంచాయతీ ఎన్నికల సామాగ్రి, పోలింగ్, అదనపు పోలింగ్ అధికారులతో కలిసి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేయడం వంటి విధులు నిర్వహిస్తారని వివరించారు. ఎన్నికల సామాగ్రి కవర్లు, డైరీలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మాస్టర్ ట్రైనర్లు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్టేజ్-1, 2 అధికారులు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

షరతులు లేకుండా సీసీఐ అధికారులు రైతులు వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్‌తో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్‌లోని మార్కెటింగ్ అధికారులు, ప్రయివేటు వ్యాపారస్తులతో కుమ్ముక్కై పత్తి కొనుగోలు అనేక అంశాలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం సాయంకాలం నుండి ఇప్పటి వరకు సర్వర్ డౌన్ ఉందనే పేరుతో పత్తి కొనుగోలు ఆపేశారన్నారు. అద్దె వాహనాల్లో పత్తి తీసుకువచ్చిన రైతులు చాలాఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమయం, ఆర్థిక నష్టం కూడా జరుగుతుందన్నారు. అదేవిధంగా స్థానిక మిల్లులో 1500 క్వింటాళ్ల వరకే పత్తి కొనుగోలు చేస్తుండడంతో మిగిలిన రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎటువంటి షరతులు లేకుండా జిన్నింగ్‌కు వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలాశ్రీ, రైతులు పెంటయ్య, నితిన్, మహాదు, గోపాల్, పోచన్న, సాయి కిరణ్, వెంకటేష్, వినోద్, ముస్తఫా, దత్తు పాల్గొన్నారు.

అర్ధరాత్రి పర్యటించి..అందరిని అభినందించి

● ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపిన సీఅండ్ఎండీ ఎన్.బలరాం నాయక్



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం, డైరెక్టర్ ఆపరేషన్ ఎల్వీ సూర్యనారాయణ, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె.వెంకటేశ్వర్లు బెల్లంపల్లి ఏరియాలో బుధవారం రాత్రి పర్యటించారు. మొదటగా గోలేటి సీహెచ్‌పీకి చేరుకున్నారు. సీహెచ్‌పీ నిర్వాహణ, పాటిస్తున్న రక్షణ, దూళి నియంత్రణ చర్యలను తెలుసుకొని ఉద్యోగులను అభినందించి సన్మానించారు. ఏఐ(కృత్రిమ మేధా)తో కూడిన రక్షణ నియమాలు వివరించే సౌండ్ సిస్టంను చూసి ప్రశంసించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న దుమ్ము లేకుండా ఆదర్శంగా నిర్వహిస్తున్న తీరు, నాటిన మొక్కలను వివరాలను తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. అనంతరం అర్ధరాత్రి ఖైర్‌గూడ ఉపరితల గనికి చేరుకున్నారు. ఉద్యోగులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఓసీలో చేపడుతున్న రక్షణ చర్యలు, ఉత్పత్తి, యంత్రాల వినియోగం ఉద్యోగులు సమిష్టి కృషిని తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏరియా ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుంటుందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, ఉద్యోగులపై తనకు నమ్మకం ఉందన్నారు. మహిళా ఉద్యోగులు అన్ని డిజిగ్నేషన్ పనులు చేయడం తెలుసుకొని వారిని అభినందించారు. ప్రధానంగా దుమ్ము లేవకుండా తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని చెప్పారు. గత ఏడాది కన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో లాభాలు ఎక్కువగా వస్తాయని తెలిపారు. కార్మికులు ఇదే స్ఫూర్తితో ఉత్పత్తి లక్ష్య సాధన దిశగా సాగాలన్నారు. ఖైర్‌గూడ ఓసీ ఈస్ట్ వ్యూ పాయింట్‌కు చేరుకొని పని స్థలాలు, విద్యుత్ వెలుగుల ఏర్పాట్లను చూసి అధికారులు, పర్యవేక్షకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్ఓటూజీఎం కె.రాజమల్లు, పీఓ ఎం.నరేందర్, వివిధ విభాగాల అధిపతులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సమావేశం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఎంపీటీసీ, జడ్పీటీసీ సాధారణ ఎన్నికలు 2025 గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల జాబితాపై మండల రాజకీయ పార్టీల నాయకులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అల్బర్ట్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మండలంలో మొత్తం ఐదు ఎంపీటీసీ స్థానాలు, ఒక జడ్పీటీసీ స్థానానికి మొత్తం మండల వ్యాప్తంగా 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు లచ్చన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ, జిల్లా సహాయ ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ సమావేశంలో ప్రతినిధులతో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేశామన్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కెరమెరి : ఎన్నికల నిర్వహణపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అంజత్ పాషా వివిధ పార్టీ నాయకులతో సమావేశంనిర్వహించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు 51 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తప్పులుంటే అభ్యంతరాలు చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కుసుంరావు, బీజేపీ మండల అధ్యక్షులు సెడ్మకి తుకారం, బీఆర్ఎస్ నాయకులు ఇనూస్, రాథోడ్ సుదర్శన్, సిరాజ్ పాల్గొన్నారు.

కౌటాల : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా పోలింగ్ కేంద్రాలపై సలహాలు, సూచనలకు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామని ఎంపీడీఓ కోట ప్రసాద్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పోలింగ్ కేంద్రాలు, ఎంపీటీసీ స్థానాలు, ఓటర్ల వివరాలను తెలియజేవారు.



అధికారుల అండదండలతోనే బియ్యం అక్రమ రవాణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో పీడీఎఫ్ బియ్యం అక్రమ రవాణ రెవెన్యూ, పోలీసు, సివిల్ సప్లయ్ అధికారుల అండదండలతోనే కొనసాగుతుందని సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల కింద సిర్పూర్(టీ)లో 200 క్వింటాళ్లపైగా బియ్యం పోలీసుల తనిఖీలో దొరికిందన్నారు. ఈ బియ్యం అక్రమ రవాణలో పోలీసు. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులకు ముడుపులు చెల్లించిన ఆడియో కూడా బయట పడిందని తెలిపారు. ఈ బియ్యం అక్రమ రవాణలో హస్తం ఉన్న అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

నీరు పొదుపుగా వాడి దిగుబడులు సాధించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులు వారి పంటలకు అవసరమైన నీటిని పొదుపుగా వాడి అధిక దిగుబడులు పొందేల కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. వాలంటరీ హైదరాబాద్ సౌజన్యంతో వివిధ పంటల్లో రైతుల నీటి యాజమాన్యం వాటర్ షెడ్ మేనేజ్ మెంట్‌పై జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త తిరుపతి, అదనపు వ్యవసాయ సంచాలకుడు మిలింద్ కుమార్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు పొందాలని, సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో పంటలు పండించి లబ్ధి పొందాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త తిరుపతి మాట్లాడుతూ తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించాలని, దీనికోసం బిందు సేద్యం, తుంపర్ల సేద్యం వంటి వాటిని ఉపయోగించాలన్నారు. వివిధ పంటలలో చీడపీడల రోగాల నివారణ సస్య రక్షణ చర్యల గురించి వివరించారు. వాలంటరీ వ్యవసాయ అధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి పంచగవ్య శివామృతం, పచ్చి రొట్టె ఎరువులు వంటి పద్ధతులు పాటించి మంచి లాభాలు పొందాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేష్, చిరంజీవి, హనుమాన్, రాము, రైతులు పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలకు ఆధ్యాత్మికతే మహా కుంభమేళా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పురాణ కాలం నుంచి అనుసరిస్తూ వస్తున్న మహాకుంభమేళా సంస్కృతి సాంప్రదాయాలకు ఆధ్యాత్మికతని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకులు గజ్జల సురేష్ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్సీకి అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సాంప్రదాయాలకు ఆధ్యాత్మికత కుంభమేళా అని వివరించారు. ఈ కుంభమేళా ప్రపంచానికే మహత్తర పండుగగా నిలుస్తుందన్నారు. ఈ కుంభమేళా 144 సంవత్సరాల తర్వాత రావడం జరిగిందని, మహా కుంభమేళా జరుగుతున్న ప్రయాగరాజ్‌లోని గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంఘమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పునీతులు కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడం గణపతి, కాంగ్రెస్ నాయకులు సిరిపురం సదాశివ్ ఉన్నారు.

తాత్కాలిక రోడ్డు వేయాలి



నవతెలంగాణ-కౌటాల

మండలంలోపి తాటిపల్లి గ్రామ శివారులోని వర్ధా నది ఒడ్డున ఉన్న శ్రీ శివ సిద్ధి హనుమాన్ మందిర్ తాటిపల్లి కుర్తా ఆలయంలో ఈనెల 24 నుంచి 28 వరకు 5 రోజులు మహా శివరాత్రి మహాజాతర మహోత్సవం కొనసాగుతుందని ఆలయకమిటీ ప్రతినిధులు తెలిపారు. దీనికి గాను రెండు రాష్ట్రల నుంచి లక్షల సంఖ్యలో గంగా స్నానం చేసి స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు రోడ్డు, రవాణ సౌకర్యం నిమిత్తం అత్యవసరం తాత్కాలిక మోరం రోడ్డు తాటిపల్లి గంగా ఒడ్డు నుంచి ఆలయం వరకు వేయాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ దండేవిఠల్‌ను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి తక్షణమే తాత్కాలిక రోడ్డు నిర్మాణం తన స్వంత నిధుల నుంచి ఆలయానికి విరాళం ప్రకటించారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మెన్ సిడం గణపతి, నవేగాం మాజీ ఎంపీటీసీ ఎల్ములే కిషోర్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు బొమ్మకంటి మహేష్, అధ్యక్షులు ఎల్ములే దత్తు, కమిటి సభ్యులు రోహినే సంతోష్, గొండె చంపత్, దివాకర్ పొట్టే, బడగే సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి

- 70 లీటర్ల బెల్లం పాకం, 2 లీటర్ల గుడుంబా స్వాధీనం



నవతెలంగాణ-జైపూర్

భీమారం గ్రామ శివారులో గుడుంబా కాస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి గుడుంబా స్థావరంపై దాడి చేసినట్లు స్థానిక ఎస్‌ఐ శ్వేత తెలిపారు. గ్రామ శివారులో గుడుంబా కాస్తున్నట్లు అందిన సమాచార మేరకు గురువారం సిబ్బందితో కలిసి వెళ్లి రెండు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుడుంబా తయారీ వనియోగించే 70 లీటర్ల బెల్లం పాకం, గుడుంబా తయారీకి వినియోగించే వస్తువులను గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీస్ కానిస్టేబుల్ సత్తిరెడ్డి, అశోక్, నిహాల్, రాజకుమార్‌తో పాటు ఎక్సైజ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

- మండల వ్యవసాధికారి ఆర్ శ్రీకాంత్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో రైతు కారుకూరి రమేష్ వ్యవసాయ క్షేత్రంలో నాలుగు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటినట్టు మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్ తెలిపారు. ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఇర్ఫానా యాస్మిన్, మాట్రిక్స్ కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో గర్భిణికి కడుపు కోత

నవతెలంగాణ-మంచిర్యాల

కాన్పు కొరకు హాస్పిటల్ కు వచ్చిన గర్భిణీ అడ్మిట్ చేసుకోక పోవడం తో కడుపులోని శిశువు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని మాత శిశు సంరక్షణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనపై జిల్లా వైద్య అధికారి హరీష్ రాజ్‌కు బాదితులు ఫిర్యాదు చేశారు బాలింత భర్త రాజన్న తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన తలండి రాజన్న నెలలు నిండిన భార్య సుమలతను వాళ్ళ అమ్మ నాన్నలు డెలివరీ కోసమని బుధవారం మంచిర్యాలలోని మాత శిశు కేంద్రనికి తీసుకొచ్చారు. వైద్యులు లేకపోవడంతో లేబర్ రూమ్‌కి వెళ్లి కలవగా పెద్ద మేడం లేదు ఈ రోజు ఓపి చూసే సమయం అయిపోయింది రేపు రావాలని తెలిపారు. ఇంటికి తీసుకోచ్చి గురువారం ఉదయం తిరిగి తీసుకొని వచ్చాక పరీక్షంచిన డ్యూటీ సిబ్బంది లోపల శిశువు హార్ట్ బీట్ రావడం లేదని లోపల శిశువు మృతి చెందినధని తెలిపారు. దీనితో నిన్న హాస్పిటల్‌కు వచ్చినపుడు అడ్మిట్ చేసుకొని ఉంటే కడుపులో ఉన్న శిశువు బ్రతికేదని సిబ్బంది నిర్లక్ష్యంతోనే నా భార్య కడుపులో ఉన్న శిశువు మృతి చెంది ఉంటుందని దానికి కారణం అయినా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా హరీష్ రాజ్‌ను వివరణ కోరగా ఫోన్‌లో ఫిర్యాదు చేశారని, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు రాలేదని తెలిపారు..సుమలతకు మాత శిశు కేంద్రంలో చికిత్స అందిస్తున్నాము లోపల శిశువు పరిస్థితి ఇంకా తెలియరాలేదని సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటమన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

- మంచిర్యాల సీఐ ప్రమోద్

నవతెలంగాణ-నస్పూర్



యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సమిష్టిగా కృషి చేద్దామని మంచిర్యాల సీఐ ప్రమోద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నిర్వహించి యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ ఇన్స్‌పెక్టర్ మనీషా రాథోడ్, కళాశాల ప్రిన్సిపల్ ఎండీ. సులేమాన్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల సీఐ మాట్లాడుతూ బాలబాలికలు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు తీసుకోవడం వలన భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, యువత తాము ఉన్న పరిసరాలలో ఇతరులు ఎవరైనా మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లయితే వెంటనే డ్రగ్స్ హెల్ప్ లైన్ 14446 నెంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని, సామాజిక బాధ్యత తీసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించి, యాంటీ డ్రగ్స్ సంబంధిత వివరణాత్మక వీడియోలను స్క్రీన్‌పై ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ రేఖ, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సందీప్, సంబంధిత అధికారులు, అధ్యాపక వర్గం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తేనె మంచు, ఆకుమచ్చ నివారణ చర్యలు చేపట్టాలి

- భీమారం వ్యవసాయ అధికారి సుధాకర్



నవతెలంగాణ-జైపూర్

భీమవరం మండల పరిధిలో గల మామిడి తోటల్లో తేనే మంచు, ఆకు మచ్చ తెగుళ్ల గుర్తించినట్లు స్థానిక వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ తెలిపారు. గురువారం కాజిపల్లి, దాంపూర్ శివారు గల మామిడి తోటలను సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడారు. తేనె మంచు, ఆకుమచ్చ తెగుల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. లాండ సై హలాత్రిన్, కార్బన్డిజం, బ్యాంకో జెబ్ 400 ఎకరా ఒకంటికి పిచికారి చేసి నివారించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ కుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్లాంట్ పనితీరులో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

- సింగరేణి సీఎండీ బలరాం నాయక్



నవతెలంగాణ-జైపూర్

మంచి పిఎల్ఎఫ్ సాధిస్తున్న ఎస్‌టీపీపీ పనితీరులో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సింగరేణి సీఎండీ బలరాం నాయక్ అన్నారు. గురువారం సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ సీపీ కె వెంకటేశ్వర్లుతో కలిసి ఎస్టీపీపీ ఆవరణలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయాలు సందర్శించారు. వీరికి ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడి(హెడ్ అఫ్ ది ప్లాంట్) శ్రీ కే.శ్రీనివాసులు పూలమొక్కను బహుకరించగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్ బలరాం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించగా ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ రాజకుమార్, శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, ఎస్టీపీపీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంటు సముద్రాల శ్రీనివాస్, ఏజీఎం(సివిల్) శ్రీ %ఖుచీ% ప్రసాద్ గారు, ఏజీఎం (ఫైనాన్స్) శ్రీ టి సుధాకం పాల్గొన్నారు.

శవ పరీక్షలకు ఎదురు చూపులు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మృత దేహలకు పోస్ట్ మార్టన్‌లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటు ఆస్పత్రి పర్యవేక్షణ అధికారి బీష్మకు గురువారం సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు. జిల్లా లోనే పెద్ద ఆస్పత్రి అయినప్పటికీ మృత దేహలకు శవ పరీక్షలు చేయాల్సిన సమయంలో చేస్తలేరని, మత దేహానికి సంబంధించి కుటంబ సభ్యులు సమయానికి వచ్చినప్పటికి గంటల పాటు శవ పరీక్షలు చేయకుండా కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని సరిపడా సిబ్బందిని ఫోరెన్సిక్ వైద్యులను నియమించి శవ పరీక్షలకు రోజుల తరబడి కుటుంబ సభ్యులు ఎదురు చూడకుండా సమయానికి పోస్ట్ మార్టన్‌లు చేసి బాడీని కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, దుంపల రంజిత్, కామిళ్ల జయరావు, ఐఆర్ సీపి రాష్ట్ర నాయకులు దుర్కే మోహన్‌లతో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, 6 గ్యారంటీలతోపాటు, ఏడవ హామీ ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరణ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. 2023 ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీలల్లో ఆరు గ్యారంటీలతో పాటు మొత్తం 420 హామీలను ఇచ్చింది అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న అమలు కావడం లేదన్నారు. రైతులకు చేస్తానన్న రుణమాఫీ ఇంకా సగానికి సగం అమలు కాలేదని, రైతుబంధు ఎకరాకు రూ.15000 ఇస్తానని రూ.12000 మాత్రమే ప్రకటించారని అన్నారు. హైదరాబాదులో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రెడ్డి మల్ల ప్రకాష్, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లన్న, జిల్లా ఉపాధ్యక్షులు దొండ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి అరుణ, జిల్లా నాయకులు సురేందర్, రాజేశం, సయ్యద్, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షుడు కుస్నేపల్లి కిష్టయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులందరిని ప్రత్యేక శిబిరంలో హాజరు పరచాలి

నవతెలంగాణ-జైపూర్



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌ల ఈ నెల 17న నిర్వహించ తలపెట్టిన ప్రత్యేక శిబిరానికి మండల పరిధి దివ్యాంగులందరినీ తరలించాలని జైపూర్ ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీఓ శ్రీపతి బాబురావుతో కలిసి గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణములు ఉచితంగా పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఈ క్రమంలో ప్రత్యేక శిబిరాలు మంచిర్యాల పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. 17న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరానికి హాజరయ్యేలా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రత్యేక శిబిరానికి హాజరయ్యేవారు ఐడీ కార్డు, సదరం వైద్య ధ్రువపత్రం, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, 16 సంవత్సరాల వయస్సు పైబడిన వారు మాత్రమే రెండు ఫొటోలు వెంట తీసుకపోవాలని సూచించారు. కాగా ఇట్టి విషయాన్ని గ్రామాలలో టామ్ టామ్ ద్వారా ప్రచారం చేసి దివ్యాంగులందరూ ప్రత్యేక శిబిరానికి హాజరు అయ్యే విధంగా చూడాలని తెలిపారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 20 లోపు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. నిరంతరం పారిశుధ్య పనులు కొనసాగించాలని తెలిపారు. ఈ నెల 26 నుండి మూడు రోజులపాటు వేలాలలో జరుపుకునే జాతరకు గ్రామపంచాయతీ సిబ్బంది, వాటర్ ట్యాంకర్లు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ కస్తూర్బా గురుకులంలో గురువారం నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బ్యాంకు లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాండూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఇందాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాలక్ష్మి పథకంలో భాగంగా విద్యార్థులు జీరో బ్యాలెన్స్ ఖాతా కలిగి ఉండాలని తెలిపారు. జన్ ధన్ యోజన పథకంలో విద్యార్థులు 50 వేలకు మించకుండా లావాదేవీలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. విద్యార్థులకు రెండు లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఉన్నత విద్య అవకాశాల కోసం బ్యాంకు రుణ సదుపాయాలను వివరించారు. నగదు రహిత ఆన్‌లైన్ బ్యాంకింగ్ జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఎఫ్ ఈ కౌన్సిలర్ల ఎన్నాం అశోక్, రవి, సత్యనారాయణ, ఎస్‌హెచ్‌ఓ కవిత పాల్గొన్నారు.

మాదారంలో మళ్లీ మంచినీటి కష్టాలు



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని సింగరేణి ప్రాంతమైన మాదారం టౌన్షిప్‌లో మంచినీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఎంవీకే-1 ఇన్‌క్లైన్ నుంచి మదారం ఫిల్టర్ బెడ్ కు సరఫరా చేసే పంపు మోటర్ చెడిపోవడంతో గురువారం నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. దాంతో కాలనీవాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత కొద్ది రోజుల కిందట సుమారు వారం రోజులకుపైగా కాలనీలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సింగరేణి యంత్రంగం పంపు మోటార్‌ను మరమ్మతులు చేసి మంచినీటి సరఫరను పునరుద్ధరించారు. నెలకొకసారి మోటార్ పంపు చెడిపోవడంతో మంచినీటి సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. మాదారం ఫిల్టర్ బెడ్ వద్ద సెక్యూరిటీ గార్డ్ లేకపోవడంతో రూ.లక్షల విలువగల ఫిల్టర్ బెడ్ సామానుకు భద్రత లేకుండా పోతోంది నీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వైరును దొంగలు చోరీ చేయడంతో కొన్ని రోజులు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చదువుతోనే మనిషికి విలువ

- ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సండ్ర



నవతెలంగాణ-జన్నారం

చదువుతోనే మనిషికి విలువ పెరుగుతుందని ప్రఖ్యాత మనస్తత్వవేత్త, ప్రేరణాత్మక వక్త సుధీర్ సండ్ర అన్నారు. రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర సినిమా హాల్ ఆవరణలో ఏర్పాటుచేసిన లిటిల్ హన్స్ రాఘవేంద్ర విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ దిశగా ముందుకు సాగితే విజయం తప్పకుండా వస్తుందని అన్నారు. లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవాలో, వాటిని ఎలా సాధించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి సమయం కృషిని కేటాయించండి. అప్పుడే పెద్ద విజయాలు సాధిస్తామని అన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల కోసం ఏదో ఒకటి చేయాలనే తపనలతో విద్యార్థులను భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో చూడాలని కోరికతో ఇంతటి మారుమూల గ్రామమైన జన్నారంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడానికి కృషి చేసిన రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ మాజీ జడ్పీటీసీ ఎర్రచంద్రశేఖర్‌ను అభినందించారు. అనంతరం మోటివేషనల్ స్పీకర్ రాజేందర్ బొల్ల మాట్లాడుతూ విద్యార్థులు భయంతో కాకుండా కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ముందుకు సాగుతామని అన్నారు. ప్రతి ఒక్కరు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ మాజీ జడ్పీటీసీ ఎర్రచంద్రశేఖర్ ఎర్ర సంపత్, ఎర్ర నరేష్, శీలం రమేష్, వివిధ పాఠశాలల కళాశాలల ప్రిన్సిపల్ ముత్యం సతీష్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శిగా మాధవ నాయక్ ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

అఖిల భారతీయ ఖాదన్ మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యదర్శిగా రెండవ సారి ఏకగ్రీవంగా పి.మాధవ నాయక్ ఎన్నికయ్యారు. ఫిబ్రవరి 12, 13 తేదీలలో నాగపూర్‌లో నిర్వహించిన 19వ మహాసభలో ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు కృషి చేసిన భారతదేశ బొగ్గు గనుల ఇన్‌చార్జి కొత్త కాపు లక్ష్మారెడ్డికి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక్ సంఘ్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పి.మాధవ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, రెండవసారి ఈ బాధ్యతను అప్పగించినందుకు నాయకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యంతో సంస్థ మనుగడకు ప్రమాదకరంగా మారుతున్నదని అన్నారు. ఈ సమావేశంలో రామగుండం, కొత్తగూడెం, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, ఇల్లందు, భూపాలపల్లి, మణుగూరు రీజియన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక




నవతెలంగాణ-లక్షెట్టిపేట

పిల్లలు, మహిళలు రక్షణ చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, దౌడెపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫైనాన్స్ లిటరసీ కార్యక్రమ ప్రతినిధి లిప్సికతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాలిక రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్టీపీపీ ఉద్యోగాల్లో స్థానికేతరులకే పెద్దపీట

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీ ప్లాంట్ ఉఉద్యోగాల్లో స్థానికేతరులకు పెద్దపీట వేస్తోంది. ప్లాంట్ ఏర్పాటులో విలువైన వ్యవసాయ భూములను నష్టపోయిన నిర్వాసితులను పక్కన పెట్టి ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై హెచ్‌ఎంఎస్ అనుబంధ ఎస్టీపీపీ కార్మిక సంఘం నాయకులు బుధవారం మాట్లాడుతూ పవర్‌మేక్ కంపెనీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంటు ఏర్పాటుతో ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లబిస్తాయని ఆశించి అవసరమైన భూములను దారాదత్తం చేసి ఉపాధి దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

నవతెలంగాణ-నస్పూర్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఫిబ్రవరి 27వ తేదీన జిల్లాలో నిర్వహిచనున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయివేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు ప్రకటించినట్టు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 14, 2025 | www.navatelangana.com

దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో హజ్రత్ సయ్యద్ సాదక్ పంజాబీ రేహమతులయే దర్గా ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ముందుగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఎస్‌సీ ఇంటర్నల్ మార్క్ టీం అబ్జర్వర్ రవి ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు రికార్డులు పరిశీలించారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. వారి వెంట సభ్యులు జి.ధర్మపాల్, రాథోడ్ మోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ విఠల్, పీడీ ఆడే విశ్వనాథ్, సిబ్బంది పవార్ వనిత, రాజేశ్వర్, నిలయ, వసంత్‌రావ్, శంకర్, సూరజ్ సింగ్, రాజశేఖర్, పండిత్ సింగ్, ప్రకాష్, రాజ్యలక్ష్మి, గంగా ఉన్నారు.



ప్రేమానుʻబంధంʼ



ఫిబ్రవరి నెల అంటేనే యువతీ యువకుల్లో ఏదో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. ఈ నెల మొదటి రెండోవారం మొదలైన దగ్గర నుంచి సోషల్ మీడియా వేదికగా వాలంటైన్స్ వీక్ సందడి మొదలవుతుంది. ఏ సోషల్ మీడియాలో చూసినా ఇదే హడావుడి హంగామా సందడి కనిపిస్తోంది. సోషల్ మీడియా వేదికగా వాలంటైన్స్ వీక్ సంబంధించిన పోస్టులు, రీల్స్ తెగ వైరల్ అవుతున్నాయి. కొన్ని జంటలు ప్రేమించుకోవడమే కాదు..పెళ్లితో వారి బంధాన్ని ముడివేసుకొని ఆనందంగా జీవనం సాగిస్తున్నాయి. నేడు ప్రేమికుల రోజును పురస్కరించుకొని నవతెలంగాణ ప్రత్యేక కథనం..

- నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎంబీబీఎస్‌లో ప్రేమ.. ఒక్కటైన జంట



రెండు రాష్ట్రాల వ్యక్తుల మధ్య ఏర్పడిన ప్రేమ ఒక కుటుంబంగా మారిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన విజయలక్ష్మీ, ఆదిలాబాద్ కు చెందిన రాహుల్ పుష్కర్ ఇద్దరికి కర్నూలు జిల్లాలో 2007 సంవత్సరంలో మెడికల్ సీటు వచ్చింది. అప్పుడు ఒకరికి ఒకరు పరిచయమయ్యారు. ఆ పరిచయం కాస్త స్నేహంగా మారింది. స్నేహం కాస్త ప్రేమగా మారగా వారి ప్రేమ ఆరు సంవత్సరాల పాటు సాగింది. చివరకు ఇరు కుటుంబాలను ఒప్పించి అందరి సమక్షంలో 2013 సంవత్సరంలో పెళ్లి చేసుకున్నారు. మళ్ళీ ఆదిలాబాద్ కు ఇరువురు రాగా మెడికల్ ఫీల్డ్‌లోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం విజయలక్ష్మి ఆదిలాబాద్ పట్టణంలో ప్రసూతి, స్త్రీ వ్యాధి నిపుణులుగా సేవలందిస్తుండగా రాహుల్ చర్మ వ్యాధి నిపుణులుగా సేవలందిస్తున్నారు. ఇద్దరు బాబులతో ఆనందంగా జీవితం సాగిస్తున్నారు.

గల్లీలో పుట్టిన ప్రేమ.. పెళ్లికి వేదికైంది

గల్లీలో పరిచయమైన ప్రేమ పెళ్లివరకు తీసుకొచ్చింది. ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్ కాలనీకి చెందిన కోదాది అఖిల్ కుమార్, అదే కాలనీకి చెందిన సంకీర్తనతో పరిచయం ఏర్పడింది. 2017 సంవత్సరంలో ఏర్పడిన ఆ పరిచయం ప్రేమగా మారి ఆరు సంవత్సరాల పాటు సాగింది. చివరికి 2024 సంవత్సరంలో వివాహానికి ఆ ప్రేమ వేడుకైంది. వీరి పెళ్లికి తొలుత కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. ఆ తర్వాత ఇరువురు పెద్దలను ఒప్పించి అందరి సమక్షంలో గ్రాండ్‌గా వివాహం చేసుకొని ఆనందంగా గడుపుతున్నారు. ఈ మధ్యే ఒక పాప కూడా జన్మించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్ర అమ్మాయితో.. ఆదిలాబాద్ అబ్బాయి



ప్రేమ అనే రెండక్షరాలతో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి చెందిన అమ్మాయి ఆదిలాబాద్ అమ్మాయిగా మారింది. బజార్‌హత్నూర్‌కు చెందిన అస్తపు కపిల్- తిరుపతికి చెందిన యోగలక్ష్మీ ఇద్దరు 2018 సంవత్సరంలో మద్రాస్ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ చేస్తుండగా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ఏకంగా 3 సంవత్సరాలలోనే ఏడడుగుల జీవితానికి నాంది పలికింది. ఇరు కుటుంబాల వారు వీరి ప్రేమను అంగీకరించడంతో 2021 సంవత్సరంలో పెళ్లి జరిపించారు. ఆ తర్వాత రిసెప్షన్‌ను తిరుపతిలో చేసుకున్నారు. ప్రస్తుతం ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా ఇద్దరు ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఒక పాప ఉంది. ఒకరినొకరు అర్థం చేసుకుంటామని దీంతో జీవితం సాఫీగా సాగిపోతుందని వారు చెబుతున్నారు.

క్రీడలో గెలుపోటములు సహజం



నవతెలంగాణ-నార్నూర్

క్రీడలో గెలుపోటములు సహజమని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ధారావత్ వనిత ప్రవీణ్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని సుంగాపూర్ గ్రామంలో ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఓటమి అనేది గెలుపుకు తొలిమెట్టు అన్నారు. ఎవరు వెనకడుగు వేయకుండా ఆటల్లో గాని చదువుల్లో గాని ఓడిపోయామని బాధపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. మొదటి బహుమతి తాడిహత్నూర్ టీమ్‌కు రూ.21వేలు, రెండవ బహుమతి సుంగాపూర్, రూ.11వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పవార్ దేవిదాస్, దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని పొచ్చేర గ్రామానికి చెందిన మెరుగు జనార్దన్‌రెడ్డి ఇటీవల మరణించారు. కాగా గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ వేర్వేరుగా వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల నాయకులు సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, మల్లెపూల సుభాష్, రాము, డాక్టర్ స్వామి, మేడిచెల్మ ప్రవీణ్, దివాకర్‌రెడ్డి, చిన్నయ్య, నరేందర్, పాల్గొన్నారు. అదేవిధంగా అడే గజేందర్ వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు అబ్రార్ అహ్మద్, పోతన్న, నాయకులు మెరుగు భోజన్న, సాయన్న, బద్దం పోతారెడ్డి, యటకారి రాజు, వంశీరెడ్డి, నదికుంట ప్రవీణ్, పాల శంకర్, ఎండీ సద్దాం, అబుధ్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

సొనాల మండలకేంద్రానికి చెందిన వ్యాపారవేత్త బీఆర్ఎస్ కార్యకర్త ఉస్మాన్ ఇంట్లో ఇటీవల దొంగతనం జరిగింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం వారి ఇంటిని పరిశీలించారు. పోలీసు అధికారులతో మాట్లాడి దొంగ తనానికి పాల్పడిన దొంగలకు వీలైనంత త్వరగా గుర్తించాలని ఆదేశించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సదానందం, నాయకులు చిన్నయ్య, సుధీర్‌రెడ్డి, నరేందర్, రామాయి శంకర్, భీమ్‌రావ్ పాటిల్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మోత్సవాల్లో భూక్యా జాన్సన్ నాయక్



నవతెలంగాణ-కడెం

మండలంలోని అక్కొండ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భూక్యా జాన్సన్ నాయక్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు జాన్సన్ నాయక్‌కి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి అనుగ్రహం ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా పాడి పంటలతో సుఖ సంతోషాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామివారిని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, దేవస్థాన కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన మహార్ నేతకాని రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ-బోథ్

హైదరాబాద్ సోమాజిగూడలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణను గురువారం మహార్, నేతకాని రాష్ట్ర నాయకులు భీంరావు పాటిల్ మర్యాదపూర్వకం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో మహార్, నేతకాని కులానికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. అలాగే సీఎం దృష్టికి తీసుకెళ్లి మహార్ కులానికి తహసీల్దార్ కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేసే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహార్, నేతకాని నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓలదే కీలక పాత్ర అని ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా పకడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయితీ ఎన్నికల నిర్వహణ, ఆర్ఓ, ఏఆర్ఓ విధులు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్‌లు ఎన్నికల నిర్వహణ, విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం మొదలుకొని, ఎన్నికల లెక్కింపు వరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో అన్ని రకాల ఫారములను జాగ్రత్తగా పూరించాలన్నారు. రోజువారిగా ఎన్ని నామినేషన్ల వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డు నందు అందుబాటులో ఉంచాలన్నారు. ఒక వ్యక్తి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చునన్నారు. నామినేషన్ల చివరి రోజు నాటికి ఏదేని ఒక నామినేషన్‌కు మాత్రమే కట్టుబడి ఉండాలన్నారు. ఒకవేళ నామినేషన్లు తిరస్కరణకు గురైతే సదరు వ్యక్తికి తిరస్కరణ పై అపీలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఎన్నికలకు 44 గంటల ముందు నుంచి ప్రచారానికి అనుమతి ఉండదన్నారు. ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ తనిఖీ, సీల్ వేయుట, తదితర ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. ఓటర్లు తమ వెంట ప్రభుత్వంచే గుర్తించబడిన ఏదేని ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలని, గుర్తింపు కార్డు యొక్క చివరి 4 అంకెలు సంబంధిత ఫారంలో నమోదు చేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు, డీపీఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్‌లు, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి శుద్ధీకరణ ప్లాంట్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో బాలవికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ ప్లాంట్, గ్రంథాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాల జిల్లాలో బెస్ట్ పాఠశాల అని పేర్కొన్నారు. పాఠశాల మౌళిక వసతుల కల్పనలో, విద్యార్థుల ప్రతిభాపాఠవాలలో ముందుందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను దష్టిలో ఉంచుకొని గ్రంథాలయం, రీడింగ్ రూమ్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థులే కాకుండా తల్లిదండ్రులు కూడా గ్రంథాలయంలో ఉన్న బుక్స్ ఉపయోగించుకోవాలన్నారు. చదవడంలో కొలమానం అంటూ ఏమీలేదని అది ఒక నిరంతర ప్రక్రియ అన్నారు. విద్యాశాఖ కమీషన్ చైర్మన్ ఈ పాఠశాలను సందర్శించి తెలంగాణలోనే బెస్ట్ పాఠశాలగా పేర్కొనడం జరిగిందని గుర్తు చేశారు. విద్యార్థులు ఇంగ్లీష్, తెలుగు బాగా మాట్లాడుతున్నారని ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు, తల్లిదండ్రుల పాత్ర చాలా ఉందని, ఈ పాఠశాలకు 13 గ్రామాల నుండి విద్యార్థులు వస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ప్రణీత, ప్రధానోపాధ్యాయులు తురాటి గంగన్న, ఎంఈఓ కంటే నర్సయ్య సుజిత్‌ఖాన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మిట్టపల్లి గ్రామపంచాయతీని తనిఖీ చేసిన డీపీఓ

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలోని మిట్టపల్లి గ్రామపంచాయతీని జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వర్ రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లో ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలు వేరు చేయట్లేదని, ఇంటి పన్ను వసూలు 100 పూర్తి చేయాలని, వసూలైన డబ్బులను ఎప్పటికప్పుడు చలానా ద్వారా గ్రామ పంచాయతీ సాధారణ నిధికి జమ చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డ్స్ అప్డేట్ చేయలేదని, శానిటేషన్ సరిగాలేదని పంచాయితీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్త పరిచారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజమణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు టెండర్లు తక్షణమే పిలవాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అటవీ ప్రాంతాల్లో వేలాది గిరిజన కుటుంబాలకు జీవనాధారమైన తునికాకు సేకరణకు టెండర్లు తక్షణమే పిలవాలని టీఏజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంభు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది డిసెంబర్, జనవరి నాటికే అటవీశాఖ టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, కొమ్మకొట్టుడు పనులను ప్రారంభించేవారన్నారు. కానీ ఈ సంవత్సరం ఇప్పటికీ టెండర్లు పూర్తికాలేదని, ప్రభుత్వం తునికాకు సేకరణపై చిత్తశుద్ధితో ముందుకు రాకపోతే, వేలాది కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దష్టిలో ఉంచుకుని, తక్షణమే టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రకతి సంపదను రక్షించడం, గిరిజనుల జీవనోపాధిని కాపాడడం ప్రభుత్వ విధులలో ఒకటిగా భావించాలని పేర్కొన్నారు. ప్రూనింగ్ పనులు ప్రారంభించాలని, లేక పక్షంలో కార్మికులు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

భారతీయ జనతా పార్టీ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి కోరారు. ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల ప్రచారంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పెన్షనర్ సంఘ భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొమురయ్య, అంజిరెడ్డికి తమ అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ఉద్యోగ సంఘ నాయకులు జనార్ధన్, విలాస్, బొడ్డు లక్ష్మణ్, కూన పోశెట్టి ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని తండ్రి, కూతురికి గాయాలు



నవతెలంగాణ-ఇచ్చోడ

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో తండ్రి, కూతురికి తీవ్ర గాయాలపాలైన ఘటన గురువారం మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం సిరికొండ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సిడాం మనోహర్ కూతురుతో కలిసి ఇచ్చోడ మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్‌పంప్‌కి ద్విచక్రం వాహనంపై వెళ్లి పెట్రోల్ పోసుకొని తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బై పాస్ దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వీరి బైక్‌కు ఢీకొంది. ఈ ఘటనలో తండ్రి, కూతురు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కి తరలించారు.

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మహా శివరాత్రిని పురస్కరించుకుని డిపో పరిధిలో ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి తెలిపారు. గురువారం డిపో కంట్రోలర్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో పరిధిలోని కదిలే పాపహరేశ్వర్, బూర్గుపల్లి, కాల్వ, ఇతర శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా రద్దీకి అనుగుణంగా అన్ని పుణ్య క్షేత్రాలకు బస్సులను నడిపించాలని సూచించారు. ఇందులో అసిస్టెంట్ మేనేజర్ ఐ. రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.నవీన్ కుమార్, కంట్రోలర్‌లు, ఏడీసీలు పాల్గొన్నారు.